RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం



CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 293 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 29-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 293 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 29-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

### నాలుగు రోజుల విదేశీ పర్యటన



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను

తరువాయి 2లో..




## నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం..

**ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

**ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం**

**అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు,

తరువాయి 2లో..

### ఏ క్షణాన ఏం జరుగుతుందో.. పొంగిపొర్లుతోన్న సరస్సు

## నేపాల్‌లో హైటెన్షన్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

హిమాలయదేశం నేపాల్‌కు వరదముప్పు పూర్తిగా తొలగిపోలేదు. ఆకస్మిక వరదలు వచ్చిన రెండు రోజుల తర్వాత టిబెట్ వైపున ఉన్న ఒక సరస్సు కట్టలు తెంచుకొని ప్రవహిస్తోందని నేపాల్ వెల్లడించింది. వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యలు చేపడుతోన్న బృందాలు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని హెచ్చరించింది. "టిబెట్ వైపున ఒక సరస్సు నుంచి నీరు పొంగిపొర్లుతోందనే సమాచారం ఉంది. సహాయక చర్యల్లో పాల్గొంటున్న బృందాలు, భద్రతా సిబ్బంది, ప్రజలు అత్యంత అప్రమత్తంగా

తరువాయి 2లో..




## భుజంపై నుంచే శత్రువుకు గురి..!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందంలో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది..? మొత్తం ఖర్చెంత..? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

**ఏంటీ 'జావెలిన్' ప్రత్యేకత..?..:** జావెలిన్.. ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఏటీజీఎం-యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి

తరువాయి 2లో..

## ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి..

### 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

**జిల్లా సంస్కృతికి ప్రతీకగా ఒంగోలు గిత్త విగ్రహం ఆవిష్కరణ**

**మహనీయుల సేవలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమన్న లోకేశ్**

**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు**

**వివిధ రంగాలకు చెందిన మహనీయుల విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు**




**ఒంగోలు, సిటిజన్ టైమ్స్**

సమాజానికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఒంగోలు నగరంలో భారీ కార్యక్రమం జరిగింది. నగరంలోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే వేదికపై ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు

తరువాయి 2లో..

### తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం..

## మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

**అసెంబ్లీలో దీర్ఘకాల సంప్రదాయాన్ని పక్కనపెట్టిన సీఎం విజయ్**


**తన కుర్చీ నుంచి లేచి మంత్రుల మధ్య కూర్చుని ఆశ్చర్యపరిచిన వైనం**

**ఒక ముఖ్యమంత్రి ఇలా చేయడం ఇదే తొలిసారి అని చెబుతున్న సభా వర్గాలు**

**సభలో అధికారులు ఉండాలని డిమాండ్ చేసిన ప్రతిపక్ష నేత ఉదయనిధి**

**ఉదయనిధి వాదనతో ఏకీభవించి హామీ ఇచ్చిన స్పీకర్ ప్రభాకర్**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర అసెంబ్లీలో ఓ కొత్త సంప్రదాయానికి తెరలేపారు. శాసనసభలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పద్ధతికి భిన్నంగా, తన కోసం కేటాయించిన ప్రత్యేక కుర్చీని వీడి, మంత్రుల కోసం ఉన్న వరుసలో వారి పక్కనే కూర్చుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఘటన సభలో ఆసక్తికర చర్చకు దారితీసింది. సాధారణంగా

తరువాయి 2లో..

### కాలుష్యం బారి నుంచి కాపాడండి..

## కృష్ణంపాలెం గ్రామస్థుల విజ్ఞప్తిపై స్పందించిన పవన్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

కాలుష్యం బారి నుంచి తమను కాపాడాలంటూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కృష్ణంపాలెం గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ కార్యకలాపాల వల్ల ఇబ్బందిపడుతున్నామని కృష్ణంపాలెం ప్రజలు సామాజిక మాధ్యమాల ద్వారా పవన్ దృష్టికి తెచ్చారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు.. కాలుష్య నియంత్రణ మండలి

తరువాయి 2లో..

### 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్..

## ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష

**2036 ఒలింపిక్స్ బిడ్డింగ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష**

**అహ్మదాబాద్ వేదికగా పలు అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ప్లాన్**

**2030 కామన్వెల్త్, 2029 పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌పై కూడా చర్చ**

**భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా మార్చడమే లక్ష్యమన్న అమిత్ షా**

**సన్నాహకాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న హోంమంత్రి**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



భారత్‌లో అంతర్జాతీయ క్రీడా సంబరాలకు రంగం సిద్ధమవుతోంది. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా సన్నాహకాలను వేగవంతం చేసింది. ఇందులో

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# జగన్ కి ఉన్న నమ్మకం నేతలకు లేదా ?

వైసీపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు ఉన్నారు. దశాబ్దాల తరబడి మంత్రులుగా పనిచేసిన వారు ఉన్నారు. రాజకీయంగా చూస్తే ఢక్కామెక్కీలు తిన్న నాయకులు కూడా కనిపిస్తారు. వీరంతా కాంగ్రెస్ అనే ఒక పురాతన రాజకీయ సంస్థలో చేరి నిష్ణాతులు అయి వచ్చిన వారు. దురదృష్టవశాత్తు ఉమ్మడి ఏపీ విభజన తరువాత ఏపీలో కాంగ్రెస్ మటు మాయం కావడంతో వారంతా మరో దారి లేక వైసీపీలో చేరారు. అయితే ఆ సమయంలో వైఎస్సార్ ప్రమాదవశాత్తు మరణించడంతో ఏర్పడిన సానుభూతి, జగన్ యంగ్ అండ్ డైనమిక్ గా జనంలో కొత్త నాయకత్వంతో కనిపించడం ఇవన్నీ కూడా అనుకూల పవనాలుగా మారి 2014లో వైసీపీని బలమైన పార్టీగా నిలబెట్టాయి. అయితే అధికారం దగ్గర దాకా వచ్చి మరీ వైసీపీ ఓటమి పాలు అయింది. ఇక్కడే అందరికీ ఒక సందేహం వస్తుంది. ఆనాడు వైసీపీ నుంచి నాయకులు ఎందుకు బయటకు వెళ్ళలేదు అని. అంతే కాదు వారికి వైసీపీ పట్ల ఎందుకు అంత నమ్మకం ఉందని. ఈ ప్రశ్నలకు జవాబులు కూడా ఉన్నాయి. ఓడినా జగన్ లో ఫైర్ అలాగే ఉంది. ఆయన కొత్త అయినా అసెంబ్లీకి వెళ్లారు, ప్రతిపక్ష నాయకుడిగా మూడేళ్ల పాటు విభజన ఏపీలో సమర్ధంగా పనిచేశారు. ఆ తరువాత జనంలోకి వెళ్ళి భారీ పాదయాత్ర చేపట్టారు. దానికి అనూహ్యమైన మద్దతు లభించింది. ఇక ఆనాడు కొంత మంది ఎమ్మెల్యేలు వెళ్ళిపోయినా పార్టీ పునాదుల నుంచి ఉన్న వారు అంతా అలాగే ఉన్నారు. ప్రజలలో కూడా వైఎస్సార్ వారసుడికి ఒక్క చాన్స్ ఇవ్వాలన్న బలమైన ఆకాంక్ష ఉందని వైసీపీలో ఉన్న సీనియర్లు గ్రహించడం వల్లనే ఆ పార్టీని అట్టిపెట్టుకుని ఉన్నారు. వారి ఆశలు ధీమాలు కూడా ఫలించాయి. జగన్ 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు. అయిదేళ్ల జగన్ పాలనలో మంచి పనులు జరగలేదని ఎవరూ అనరు కానీ అంతకు మించి ప్రజా వ్యతిరేక చర్యలు కూడా జరిగాయి. దానికి జగన్ అనుభవ రాహిత్యంతో పాటు ఎవరి మాటా వినకపోవడం అన్నది కూడా సీనియర్లు గ్రహించారు అని చెబుతారు. ఇక ఈ మొత్తం ఎపిసోడ్ లో వైసీపీ అధికారంలో ఉండడం చూశారు, విపక్షంలో ఉండడం చూశారు, ఇపుడు 2024 నుంచి కూడా చూస్తున్నారు. దాంతోనే సీనియర్ల మార్క్ విశ్లేషణలు ఉన్నాయని అంటున్నారు. ఏపీ రాజకీయం కూడా గతానికి భిన్నంగా ఉంది. జనసేన మెల్లగా బలమైన పార్టీగా మారుతోంది. పుబ్బలో పుట్టి మఖలో మాడే పార్టీ కాదు అని అర్థం అవుతోంది. పైగా ఏపీలో అత్యంత జనాభా శాతం కలిగిన బలమైన సామాజిక వర్గం ఈ రోజుకీ జనసేనతోనే ఉందని కూడా గ్రహిస్తున్నారు. చంద్రబాబును జగన్ ని చూసేసిన జనాలు చాన్స్ ఇస్తే పవన్ కి ఇస్తారు అని కూడా విశ్లేషణలు ఉన్నాయి. అలాగే బలమైన సామాజిక వర్గంలో తమ నుంచి సీఎం గా ఒకరు కావాలని ఉంది. ఇవన్నీ కూడా వైసీపీని మరోసారి అధికారంలోకి రానీయకుండా చేసే సెంటిమెంట్ అస్త్రాలుగానే వైసీపీలో సీనియర్లు చాలా మంది చూస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు టీడీపీలో కూడా యువ నేతగా బలమైన సారధిగా లోకేష్ అవతరించారు. లోకేష్ ప్రత్యర్థులు అనుకున్నట్లుగా పప్పు కాదని నిప్పు అని నిరూపించుకున్నారు. టీడీపీకి లోకేష్ రూపంలో బలమైన అండ ఉంది. దాంతో టీడీపీని మరో నలభై ఏళ్ళ పాటు నడిపే దృఢమైన నాయకత్వం లభించింది అని అంటున్నారు. లోకేష్ ని కూడా సీఎం గా చూడాలని జనంలోనూ ఉంది, టీడీపీలో ఉంది. మరో బలమైన సామాజిక వర్గంలోనూ ఉంది. ఇలా చూస్తే ఏపీలో ఇపుడు ఫ్రెష్ లీడర్లు ఎవరూ అంటే పవన్ లోకేష్ కనిపిస్తున్నారు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంతటి పోటీ వాతావరణంలో వైసీపీ బలీయమైన పార్టీగా పోరాటాలు చేయాల్సి ఉండగా కూటమి వ్యతిరేకత తమకు అధికారాన్ని కట్టబెడుతుందని ఈ రోజుకీ భావిస్తూ ఉండడమే వైసీపీలో సైతం తలపండిన రాజకీయ నేతలను ఆలోచనల్లో పడేస్తోంది అని అంటున్నారు. అంతే కాదు వైసీపీ వ్యూహాలు లేకుండా గాలిలో మేడలు కడుతోందని కూడా భావిస్తున్నారు. అసెంబ్లీకి వైసీపీ వెళ్ళకపోవడం ఒక భారీ తప్పిదంగా వైసీపీలో కూడా అనుకుంటున్నారని చెబుతున్నారు. అలాగే రెండేళ్ళకు పైగా కాలం గడచినా అధినాయకుడు జనంతో కానీ క్యాడర్ తో కానీ నేరుగా కనెక్ట్ కాకపోవడం కూడా అంతా చర్చించుకునే పరిస్థితి ఉంది. వైసీపీకి దూరం అయిన వర్గాలను దగ్గరకు తీసే ప్రయత్నం చేయకపోవడం పార్టీని వీడిన వారిని కలుపుకుని పోయే చర్యలు చేపట్టకపోవడం కూడా సీనియర్లు గమనిస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద వచ్చేది మనమే అని జగన్ ఎంత నిబ్బరంగా చెబుతున్నా సీనియర్లు అయితే అంతలా నమ్మడం లేదని అంటున్నారు. అందుకే బిగ్ షాట్స్ సైతం తమ దారి తాము చూసుకునేందుకు ఆలోచిస్తున్నారా అన్నదే ఇపుడు హాట్ టాపిక్ గా ఉంది.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం..

అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పీ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్‌కు రానున్న 'జావెలిన్'..

ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు.. ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర దాదాపు 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.

**ఉక్రెయిన్‌కు దేవదూత..**

రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఈ క్షిపణులను ఉక్రెయిన్ వాసులు 'దేవదూత'తో పోల్చారు.

# 2036 ఒలింపిక్స్‌పై కేంద్రం ఫోకస్.. ఆతిథ్య బిడ్‌పై అమిత్ షా సమీక్ష

భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఒలింపిక్స్ బిడ్డింగ్ ప్రక్రియ పురోగతిని, క్రీడల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. ఒలింపిక్స్‌తో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2029లో జరగనున్న పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌ను కూడా అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశం అనంతరం అమిత్ షా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను నిర్వహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ స్పోర్టింగ్ డెస్టినేషన్‌గా నిలబెట్టడానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, గుజరాత్ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. అహ్మదాబాద్‌లో క్రీడల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులు అమిత్ షాకు వివరించారు. ఇటీవల గ్లాస్గోలో 2026 కామన్వెల్త్ గేమ్స్ ముగిసిన తర్వాత, తదుపరి ఆతిథ్య నగరంగా అహ్మదాబాద్ తరఫున గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కామన్వెల్త్ గేమ్స్ పతాకాన్ని అందుకున్న విషయం విదితమే.

# ఒంగోలులో మహనీయుల స్ఫూర్తి..

## 20 విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

ప్రతీకగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు, వారి సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, సాహిత్య రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నిత్యం కనిపించేలా ప్రధాన కూడలిలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ స్ఫూర్తిదాయక విగ్రహాలు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆయన తెలిపారు.

**ఒంగోలు గిత్త.. జిల్లాకే గర్వకారణం**

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన ఒంగోలు జాతి పశువుల విశిష్టతను చాటిచెప్పేలా, జిల్లా సంస్కృతికి అద్దం పట్టేలా ఒంగోలు గిత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రకాశం జిల్లా పశుసంపదకు, వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, దీని ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరిసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించిన విగ్రహాల వివరాలు:**

రాజకీయ, స్వాతంత్ర్య సమరయోధులు: రొండా నారపరెడ్డి (మాజీ మంత్రి, ఎంపీ), దర్శి చెంచయ్య (స్వాతంత్ర్య సమరయోధుడు), మాదాల నారాయణ స్వామి (మాజీ ఎంపీ, ఎమ్మెల్యే) సామాజిక సేవకులు, విద్యావేత్తలు, అధికారులు: కత్తి చంద్రయ్య (ప్రకాశం జిల్లా తొలి కలెక్టర్), వరదా శ్రీరాముల నాయుడు (ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు), బివియల్ నారాయణ ('పావలా డాక్టర్'), క్లౌ జాన్ ఎవరెట్ (సామాజిక సేవకులు), గోరంట్ల వెంకన్న (మహాదాత), శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి (ద్రావిడ భాషాశాస్త్ర పితామహులు), బండారు రామారావు (నాటక సమాజ నిర్వాహకులు) కళా, సాహిత్య రంగ ప్రముఖులు: భానుమతి రామకృష్ణ (బహుముఖ ప్రజ్ఞాశాలి, నటి), గరికపాటి వరలక్ష్మి (నటి, గాయని), టి. కృష్ణ (విప్లవ దర్శకులు), షేక్ చినమౌలానా (నాదస్వర విద్వాంసులు), నీలంరాజు వెంకట శేషయ్య (పాత్రికేయులు, సాహితీవేత్త), ధారా రామనాథ శాస్త్రి (నాట్యావధాని), నాగభైరవ కోటేశ్వరరావు (కవి, రచయిత), కలేకూరి ప్రసాద్ (దళిత కవి, రచయిత), పైడి తెరేష్ బాబు (దళిత సాహితీవేత్త, కళాకారులు), మల్లవరపు జాన్ (కవి, రచయిత).

## మొదటి పేజీ తరువాయి

### ఏ క్షణాన ఏం జరుగుతుందో.. పొంగిపొర్లుతోన్న సరస్సు

# నేపాల్‌లో హైటెన్షన్

ఉండాలి. అంతా సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లాలి" అని నేపాల్ పోలీసులు హెచ్చరించారు. సరస్సులో నీటి ప్రవాహం పెరుగుతోందని రసువా జిల్లా ఉన్నతాధికారి నరేంద్ర పరియార్ వెల్లడించారు. దీంతో స్థానికులు కొండ ప్రాంతాలవైపు తరలివెళ్తున్నారని తెలుస్తోంది. హిమానీనదం (గ్లేసియర్) విరిగిపడటం నేపాల్‌లో బుధవారం నాటి జల ప్రళయానికి కారణమైంది. ఆ విపత్తు వల్ల పేరుకుపోయిన పెద్ద రాళ్లు, బురద, మంచు, ఇతర శిథిలాలతో టిబెట్ వైపున ఒక సరస్సు ఏర్పడింది. అక్కడ నీటి పరిమాణం పెరగడంతో ప్రస్తుతం అది పొంగిపొర్లుతోంది. దీంతో చైనా (జప్త్రఅఖు) కూడా సహాయక చర్యలు నిలిపివేసింది. టిబెట్‌లో మళ్లీ వరదముప్పు పొంచి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరిస్థితులను సమీక్షించారు. టిబెట్ సరిహద్దులోని భోటే కోషి నదీ ప్రవాహం మొదలయ్యే దగ్గర కొత్తగా ఓ సరస్సు ఏర్పడిందని నేపాల్‌కు చైనా ఇప్పటికే అలర్ట్ ఇచ్చింది. గురువారం ఉదయం నాటికి 20లక్షల క్యూబిక్ మీటర్ల నీటితో ఉన్న ఈ సరస్సులోకి.. మూడు రోజుల్లో మరో 30లక్షల క్యూ.మీ నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. దీంతో అది తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది. కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ - ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

### తమిళనాడు అసెంబ్లీలో అరుదైన దృశ్యం..

# మంత్రుల సీట్లలోకి సీఎం విజయ్!

అసెంబ్లీలో ముఖ్యమంత్రికి స్పీకర్ కుర్చీకి దగ్గరగా, ప్రత్యేకమైన, విశాలమైన కుర్చీని కేటాయిస్తారు. మంత్రులు వారి సీనియారిటీ ప్రకారం సీఎం పక్కన మొదటి వరుసలో కూర్చుంటారు. వారికి ఎదురుగా ప్రతిపక్ష నేత, ఇతర శాసనసభాపక్ష నేతలు ఆసీనులవుతారు. ఇది ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. అయితే, నిన్న మధ్యాహ్నం జరిగిన సమావేశంలో సీఎం విజయ్ అనూహ్యంగా తన కుర్చీ నుంచి లేచి, సభా నాయకుడైన మంత్రి కేఏ సెంగొట్టయాన్, మరో మంత్రి ఆదవ్ అర్జున మధ్యలో కూర్చున్నారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కొద్దిసేపు తమ సహచరులతో మాట్లాడేందుకు స్థానాలు మారడం సహజమే. కానీ, ఒక ముఖ్యమంత్రి తన అధికారిక కుర్చీని వీడి మంత్రుల సీట్లో కూర్చోవడం ఇదే మొదటిసారని, గతంలో ఏ ముఖ్యమంత్రీ ఇలా చేయలేదని సభా వర్గాలు చెబుతున్నాయి.

అధికారుల హాజరుపై ప్రతిపక్ష నేత డిమాండ్

ఇదిలా ఉంటే.. అంతకుముందు సభలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులు సభలో తప్పనిసరిగా ఉండేలా చూడాలని ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ స్పీకర్‌ను కోరారు. "గత డీఎంకే ప్రభుత్వ హయాంలో కరూర్ ఘటనపై చర్చ జరిగినప్పుడు అప్పటి సీఎం (ఎంకే స్టాలిన్), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు సభలోనే ఉన్నారు. కానీ ఇప్పుడు సీఎం, కార్యదర్శులు ఎవరూ సభలో లేరు" అని ఆయన ప్రస్తావించారు. దీనిపై మంత్రి ఆదవ్ అర్జున స్పందిస్తూ, కార్యదర్శులు పక్కనే ఉన్న 'వార్ రూమ్' నుంచి సభ్యుల ప్రసంగాలను నోట్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఉదయనిధి వాదనతో స్పీకర్ జేసీడీ ప్రభాకర్ ఏకీభవించారు. ఇకపై కీలక చర్చల సమయంలో సీనియర్ అధికారులు సభలో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, సీఎం విజయ్ ఉదయం కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని, ఆ తర్వాతే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని తెలిసింది.

# కాలుష్యం బారి నుంచి కాపాడండి..

అధికారులు బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థలో తనిఖీలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. అక్కడకు వెళ్లిన అధికారులు.. పరిశ్రమలో యంత్ర పరికరాల ట్రయల్ రన్‌లో కలప వ్యర్థాలను ఇంధనంగా ఉపయోగించడం వల్ల బాయిలర్ నుంచి వెలువడుతున్న కాలుష్య వాయువులు అత్యవసర ద్వారం నుంచి గ్రామాల వైపు వ్యాపిస్తున్నట్టు గుర్తించారు. నిబంధనల ప్రకారం మల్టీసైక్లోన్ డస్ట్ కలెక్టర్ అనే వాయు కాలుష్య నియంత్రణ పరికరాన్ని బాయిలర్ పొగ గొట్టానికి అనుసంధానించి, శుద్ధి చేసిన ఉద్గారాలను తగిన ఎత్తు కలిగిన చిమ్నీ ద్వారా విడుదల చేయాల్సి ఉంది. యంత్రాల ప్రీ కమిషనింగ్ ప్రక్రియలో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ సంస్థ ఈ నిబంధనను పాటించడం లేదని గుర్తించారు. కాలుష్య నియంత్రణ పరికరాలు అమర్చిన అనంతరం కార్యకలాపాలు కొనసాగించుకోవాలని సదరు సంస్థ యాజమాన్యానికి పీసీబీ అధికారులు సూచించారు. చిమ్నీ ఏర్పాటు పనులు పూర్తి చేసేందుకు సదరు సంస్థ 20 రోజుల గడువు కోరగా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టిన తర్వాతే కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారు.

# ఎండాడలో రూ. 3 కోట్లతో బయో ఫెర్టిలైజర్ ల్యాబ్

## శంకుస్థాపన చేసిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





**సిటిజన్ టైమ్స్, ఆగస్టు 28, (భీమిలి):**

వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల వ్యయంతో ఎండాడలో ప్రతిపాదించిన అత్యాధునిక బయో ఫెర్టిలైజర్ ల్యాబ్ నిర్మాణ పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో కాకినాడ జిల్లా సామర్లకోటలో మాత్రమే ఇటువంటి ల్యాబ్ అందుబాటులో ఉందని, రైతులకు నాణ్యమైన సేంద్రియ ఎరువులు, సూక్ష్మ పోషకాలను చేరువ చేసేందుకు ప్రభుత్వం కొత్తగా ఎండాడతో పాటు పల్నాడు జిల్లా అమరావతి, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులలో వీటిని ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా భవన నిర్మాణానికి రూ.1.8 కోట్లు, అవసరమైన అత్యాధునిక యంత్ర పరికరాలు, మంచినీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.1.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టనున్న ఈ భవన నిర్మాణ బాధ్యతలను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షించనుంది. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా స్థానిక పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీలు విజయ్ ప్రసాద్, మాణిక్యాంబ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడుతో పాటు కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, గోపీ, లొడగల రామ్మోహన్, మంగాదేవి, సారిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గంటాకు రాఖీ కట్టిన విద్యార్థినులు



**భీమిలి, సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 28:**

భీమిలి నెహ్రూ స్కూల్ విద్యార్థినులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిసిన వారు రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. విద్యార్థినులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని గంటా శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఎలాంటి సమస్య ఉన్నా వారు తనను నేరుగా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# ఈవీఎం గోడౌన్ల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

## జేసీ శౌర్య మాన్ పటేల్

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28::**

ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్లను జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములను సందర్శించిన ఆయన, అక్కడ అమర్చిన సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారాలకు వేసిన భద్రతా సీళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలను పక్కాగా పాటించాలని అక్కడి భద్రతా సిబ్బందికి, అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్‌లో తన పర్యటన వివరాలను నమోదు చేసి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# దోపిడీ పాలనపై తిరుగుబాటు..

# విశాఖ గడ్డపై కొత్త రాజకీయ శంఖారావం

### తెలుగు శక్తి నేత బి.వి.ఆర్ సంచలన ప్రకటన -ఎన్టీఆర్ ఆశయాలు, కార్మికుల ఆవేదనతో సరికొత్త పార్టీ ఆవిర్భావం

### జీవీఎంసీ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పోటీకి సిద్ధం -విశాఖ భూదోపిడీ, ఎయిర్‌పోర్ట్ కార్మికుల సమస్యలు, రెడ్‌బుక్ రాజకీయాలపై ధ్వజం

### కూటమి వైఖరిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28:**

ప్రజా సమస్యల పరిష్కారానికే కొత్త రాజకీయ పార్టీ నందమూరి తారక రామారావు ఆశయాలను ఆచరణలో చూపిస్తూ, కార్మికుల ఆక్రందనలు మరియు యువత ఆవేదనను తీర్చేందుకు కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు తెలుగు శక్తి అధినేత బి.వి.ఆర్ విశాఖపట్నంలో ప్రకటించారు. అంబేద్కర్ సాక్షిగా ప్రజాక్షేత్రంలో రూపుదిద్దుకుంటున్న ఈ పార్టీ ద్వారా రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో అన్ని వార్డుల నుంచి అభ్యర్థులను నిలబెడతామని స్పష్టం చేశారు. సొంతంగా పోటీ చేసే సత్తా లేక పొత్తులపై ఆధారపడుతున్న టీడీపీలో నిబద్ధత గల కార్యకర్తలకు గుర్తింపు లేకుండా పోయిందని, పదవుల కోసం కాకుండా ప్రజల కోసమే పనిచేసే నాయకత్వం ఇప్పుడు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు.

**అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి వర్ధిల్లాలి.. దోపిడీ ఆగాలి**

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ పేరుతో భయపెట్టే రాజకీయాలు నడుస్తున్నాయని, ప్రశ్నించే తత్వాన్ని ప్రజలు అలవరచుకోవాలని బి.వి.ఆర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో కారుచౌకగా భూములను దోచుకుంటున్నారని, సెక్షన్ 22–ఏ పేరుతో సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అమరావతితో పాటు విశాఖ భూవ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే ఏళ్ల తరబడి సేవలందించిన విశాఖ ఎయిర్‌పోర్ట్ కార్మికులకు చట్టబద్ధంగా అందాల్సిన ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ప్రశ్నించాల్సిన వారి మౌనం – విశాఖ ఆత్మగౌరవ పోరాటం**

గతంలో ప్రజల పక్షాన అన్యాయాన్ని ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నేడు ప్రజా సమస్యలు, కార్మికుల కన్నీళ్లు కనిపిస్తున్నా మౌనం వహించడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్నది అహంకారానికి, ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధమని పేర్కొన్నారు. విశాఖ భవిష్యత్తును కొందరు రాజకీయ నాయకులు కాకుండా విశాఖ ప్రజలే నిర్ణయించేలా, నగర అభివృద్ధి మరియు ప్రజా హక్కుల రక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# రిజిస్టర్డ్ వాల్యూయర్ల సమస్యల పరిష్కారానికి పల్లా చొరవ

### వాల్యూయర్ల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ స్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తాలి

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులి



**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 28:**

ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్డ్ వాల్యూయర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవ చూపారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ప్రాంతాలకు చెందిన రిజిస్టర్డ్ వాల్యూయర్ల ప్రతినిధులు శుక్రవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు ని కలిసి తమ సమస్యలను వివరించారు. 34ఏబి కింద ఎంపానెల్‌మెంట్, వెరిఫికేషన్, ఆమోద ప్రక్రియ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, ప్రయాణ వ్యయం, ఆర్థిక భారం పెరుగుతోందని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్టర్డ్ వాల్యూయర్లు భూములు, భవనాలు, ప్లాంట్ అండ్ మెషినరీ, సెక్యూరిటీస్ అండ్ ఫైనాన్షియల్ అసెట్స్‌కు సంబంధించిన ఆస్తుల విలువ నిర్ధారణ వంటి కీలక సేవలను అందిస్తున్నారని ప్రతినిధులు పల్లాకు వివరించారు. రాష్ట్రంలో సుమారు 800 మంది రిజిస్టర్డ్ వాల్యూయర్లు సేవలందిస్తున్న నేపథ్యంలో, వారి ఇబ్బందులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ స్థాయిలో తగిన చర్యలు తీసుకునేలా చేస్తానని పల్లా శ్రీనివాసరావు గారు హామీ ఇచ్చారు. 34ఏబి కింద ఎంపానెల్‌మెంట్, వెరిఫికేషన్, ఆమోద ప్రక్రియను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా విశాఖపట్నం, విజయవాడ లేదా తిరుపతిలో ఏదో ఒకచోట నిర్వహించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, నిబంధనలకు అనుగుణంగా సాధ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వాల్యూయర్ల సమయం, ప్రయాణ భారం, వ్యయాన్ని తగ్గించేలా ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

### పాయకరావుపేటలో సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



**పాయకరావుపేట, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక 'జలహారతి' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్, పలువురు ఎమ్మెల్యేలు మరియు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు మళ్లించి ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నాన్ని సీఎం సాకారం చేస్తున్నారని హోం మంత్రి అనిత తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర ప్రజల పండుగగా అభివర్ణించిన ఆమె, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి అని పేర్కొన్న ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, సభకు వచ్చే వేలాది మంది ప్రజలకు తాగునీరు, పార్కింగ్, భద్రత వంటి మౌలిక వసతుల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గోదావరి జలాల రాకతో ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి సరికొత్త ఉత్తేజం లభిస్తుందని మంత్రులు స్పష్టం చేశారు.

# గోపాలపట్నం- పాత గోశాల 100 అడుగుల రోడ్డు విస్తరణ

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28::**

గోపాలపట్నం జంక్షన్ ఆర్చి నుంచి పాత గోశాల వరకు 3.10 కిలోమీటర్ల మేర 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ పనులను 120 రోజుల్లో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రాంతాలను పరిశీలించిన ఆయన, వెంటనే సమగ్ర సర్వే చేసి మార్కింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ విస్తరణలో ప్రభావితమయ్యే 348 ఆస్తులకు నిబంధనల ప్రకారం టీడీఆర్ లేదా తగిన పరిహారం వేగవంతంగా అందించి స్థలాన్ని క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. మౌలిక వసతులకు వీఎంఆర్‌డీఏ నిధులు సమకూర్చనుండగా, రోడ్డు నిర్మాణ పనులను జీవీఎంసీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన గంటా





**విశాఖపట్నం,, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 28**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 613 ఎకరాల్లో ఇనాం సమస్య పరిష్కరించాలని బోని గ్రామస్తులు కోరారు. మాన్సాస్ ట్రస్టుతో ఉన్న వివాదానికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. దీనిపై మాన్సాస్ అధికారులు, ఆనందపురం ఎమ్మార్వోలతో గంటా ఫోన్ లో మాట్లాడారు. మధురవాడ వికలాంగుల కాలనీలో కేటాయించిన ఇళ్ల స్థలాల్లోకి వెళ్తే తనపై మాజీ కానిస్టేబుల్ దౌర్జన్యం చేస్తున్నారని, తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని కొందరు దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. 3, 4 వార్డుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆ ప్రాంత వాసులు వినతి పత్రం సమర్పించారు. భీమిలి జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్, ఈఈ వెంకట వాసు తదితరులు పాల్గొన్నారు.

**పారిశుద్ధ్య కార్మికులకు నూనె, సబ్బుల పంపిణీ**

జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు గంటా కొబ్బరినూనె, సబ్బులను పంపిణీ చేశారు. ప్రజల కోసం తమ ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి పని చేస్తున్న సిబ్బందికి ఎంత చేసినా తక్కువేనని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# సమస్యల పరిష్కారానికే 'వన్ మంత్--వన్ విలేజ్'

## ఉత్తర నియోజకవర్గంలో 47 వినతుల స్వీకరణ





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 28::**

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం 'వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మాధవస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ సంయుక్తంగా పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ మొత్తం 47 వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో నెలకు నాలుగుసార్లు ఈ వినతుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని, వచ్చే శుక్రవారం కూడా దీనిని నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు వార్డుల్లో పెద్ద కమ్యూనిటీ హాళ్లు లేకపోవడం వల్ల ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మాధవస్వామి కల్యాణ మండపం ఆధునికీకరణకు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.49 లక్షలతో ప్రతిపాదనలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో టి.గోవిందు, విశాఖ ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, సీతమ్మధార, గోపాలపట్నం తహసీల్దార్లు ప్రసాద్, రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీ అన్నదానం..!



**ఆనందపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆనందపురం ఉన్నత పాఠశాల సమీపంలో వేంచేసియున్న శ్రీ భూలోకమాత అమ్మవారి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 4,000 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆనందపురం పరిధిలో నేడు విద్యుత్ సరఫరకు అంతరాయం



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

33/11ఎజ ఆనందపురం సబ్ స్టేషన్ నుంచి మండల హెడ్ క్వార్టర్ ఫీడర్ మరియు 33/11కేవీ బోనీ హెడ్ క్వార్టర్ ఫీడర్ ల మెయింటైనెన్స్ మరియు చెట్టు కొమ్మలు తొలగించుట నిమిత్తం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును అని బి సింహాచలం నాయుడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్, జోన్ -3, వారు తెలియజేశారు. ఈ నేపథ్యంలో వేములవలస ,ఆనందపురం ,బి పి కల్లాలు ఎస్సీ బీసీ కాలని సుఖీభవ లేఔట్ ,బోనీ,శిర్లపాలెం ,పేకేరు ముకుందపురం గ్రామాలకు సంబంధించిన గృహ వినియోగదారులుకు మరియు పారిశ్రమాకా వినియోగదారులుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**చింతలపూడి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 28:**

చింతలపూడి శాసనసభ్యుల క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను సానుకూలంగా విన్న శాసనసభ్యులు, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజల కోసం.. ప్రజల మధ్య.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న శాసనసభ్యులు.

# ఎమ్మెల్యే కు రాఖీలు కట్టిన నియోజకవర్గ మహిళలు

### విజయవాడ ఎమ్మెల్యే కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు

### తిలకం దిద్ది మిఠాయిలు తినిపించిన మహిళలు

### రాఖీ సోదర--సోదరీమణుల అనుబంధానికి ప్రతీక: యార్లగడ్డ

### మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**విజయవాడ: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 28:**

విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు గన్నవరం నియోజకవర్గానికి చెందిన మహిళా సోదరమణిలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించారు. అనంతరం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సోదర--సోదరీమణుల ఆప్యాయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ అని అన్నారు. ఇలాంటి పండుగలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాన్సాస్ భూ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయండి

## - ఆ తర్వాతే విలీనం - ఎమ్మెల్యే గంటాకు వినతి

## -బోని గ్రామస్తుల ఆక్రందన

**ఆనందపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**



ఆనందపురం మండలం బోని గ్రామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మాన్సాస్ భూ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేసిన అనంతరం గ్రామాన్ని జీవీఎంసీలో విలీనం చేయాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును శు క్రవారం భీమిలి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాగావంశం డైరెక్టర్, ఆనందపురం మండల టీడీపీ ఉపాధ్యక్షుడు సూరాల సత్యవర ప్రసాద్ ఆధ్వర్యంలో బోని గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కొనసాగుతున్న ఈ భూ సమస్య కారణంగా గ్రామంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఈ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగేవని, బ్యాంకులు వ్యవసాయ రుణాలు కూడా మంజూరు చేసేవని పేర్కొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ నుంచి అడంగల్ ప్రతులు అందకపోవడంతో రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారం-3 జారీ కాకపోవడంతో వ్యవసాయ అవసరాల కోసం కొత్త విద్యుత్ మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు పొందడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భూ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. బోని గ్రామాన్ని జీవీఎంసీలో విలీనం చేయడంపై తమకు వ్యతిరేకత లేదని, అయితే ముందుగా భూ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సూరాల సత్యవర ప్రసాద్ తెలిపారు.

# ఆర్మీ నియామక ర్యాలీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశం




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28:**

అగ్నివీర్ పథకం కింద సెప్టెంబర్ 2 అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రధాన ర్యాలీతో పాటు ఆర్.కె. బీచ్ రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కిలోమీటర్ల మేర రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,350 మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిర్వహణ పర్యవేక్షణ కోసం ఇద్దరు నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. ర్యాలీ ప్రాంగణంలో తాగునీరు, పారిశు ద్ధ్యం, లైటింగ్, బారికేడింగ్ వంటి మౌలిక వసతులను జీవీఎంసీ సమకూర్చాలని, ట్రాఫిక్ నియంత్రణతో పాటు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను పోలీస్ శాఖ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవల నిమిత్తం రన్నింగ్ ట్రాక్, స్టేడియం వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులు, ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ర్యాలీ వివరాలను మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ అమరేష్ సింగ్, ఇంచార్జి డీఆర్వో టి. గోవిందు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీలో తర్లువాడ విలీనానికి గ్రామసభ ఏకగ్రీవ ఆమోదం

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 28:**



విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధి విస్తరణలో భాగంగా ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 79 గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ కోసం సంబంధిత పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీలో పంచాయతీ విలీనానికి గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అయితే, గ్రామానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న మూడు కీలక పథకాలను రాబోయే పదేళ్లపాటు యథావిధిగా కొనసాగించాలని వారు ముక్తకంఠంతో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉపాధి హామీ పథకంతో పాటు ఇళ్ల పన్నుల రాయితీలు, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న మూడు సెంట్ల ఇళ్ల స్థలాల పథకాన్ని విలీనం తర్వాత కూడా మరో పదేళ్లు పంచాయతీ ప్రజలకు వర్తింపజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, జనసేన నాయకులు మజ్జి శ్రీను, తాట్రాజు అప్పారావు, మజ్జి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి ధనంజయరావుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

### అనకాపల్లిలో పరిశీలకురాలు గౌతమి క్షేత్రస్థాయి తనిఖీలు



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 28::**

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపడుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026' ఫేజ్-3 ప్రక్రియలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి, ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలకురాలు ఎమ్. గౌతమి శుక్రవారం అనకాపల్లి పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేబాక గ్రామ పంచాయతీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలు (159, 160, 161), అనకాపల్లి మెయిన్ రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను (202, 203, 204) ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం--6, అభ్యంతరాలు--తొలగింపుల కోసం ఫారం--7, మార్పులు--చేర్పుల కోసం ఫారం--8 దరఖాస్తుల స్వీకరణ, పంపిణీ వివరాలను అక్కడి బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జాబితా నుంచి మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా, నిబంధనల ప్రకారం చేపట్టాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఆనందరావుతో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తి భావానికి ప్రతీకగా శివాలయం.. భూమిపూజ చేసిన మంత్రి



**మన్నేరువాండ్లపల్లె :(సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 28**

అన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజకవర్గం, రామాపురం మండలం, మన్నేరు వాండ్ల పల్లెలోరూ.20 లక్షల వ్యయంతోలి నూతనంగా నిర్మించనున్న లిశివాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రిమండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న లిశివాలయం నిర్మాణం త్వరలో పూర్తైభక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## లంకమల అభయారణ్యంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు



**బద్వేలు, సిటిజన్ టైమ్స్; ఆగస్టు 28**

బద్వేల్ మండలం లంకమల అభయారణ్యంలో గుప్త నిధుల తవ్వకాలు వేట కలకలం రేగింది బద్వేల్ కు సమీపంలోని కొత్తచెరువు గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ముఠాఅనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అధికారులను చూసి మరో నలుగురు అడవిలోకి పరార్ అయినట్లు సమాచారం పట్టుబడిన వ్యక్తులు తిరుపతి, సిద్ధవటం, రాయచోటి ప్రాంతాలకు చెందిన వారిగా అనుమానం గా ఉందని అధికారులు తెలిపారుఘటనా స్థలంలో 3 బైకులు, 1 కారును స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు గుప్త నిధుల కోసం అభయారణ్యంలోకి అక్రమంగా ప్రవేశించి గుప్త నిధులకు పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

## శ్రీ వనవులమ్మ తల్లికి మ్రొక్కులు చెల్లింపు



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

మండలంలోని విలస గ్రామానికి చెందిన గ్రామదేవత శ్రీ వణువులమ్మ అమ్మవారి గుడి వద్ద శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి గాజులు అలంకరణ భక్తుల ఘనంగా జరిపారు. శుక్రవారం గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అమ్మవారి తరుపు నుంచి జాకెట్ ముక్కలు ,గాజులు, పసుపుకొమ్ములు, కుంకుమ పసుపు ముద్ద పువ్వులు వాయనం కింద ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఆడ పడుచులకు అన్నగా.. అండగా ఉంటా..

## మంత్రి సుభాష్‌కు రాఖీ కట్టేందుకు వేలాదిగా తరలివచ్చిన మహిళలు

## కోటిపల్లి- ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా -రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

అనురాగం, ఆత్మీయత, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను రామచంద్రపురం టౌన్‌హాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వేలాది మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు అన్నగా అండగా ఉంటానని, వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని తెలిపారు. రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదని, అనురాగం, ఆత్మీయత, ఆత్మవిశ్వాసంతో బంధాలను మరింత బలోపేతం చేసే పండుగ అని పేర్కొన్నారు.

**కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధిస్తా**

రామచంద్రపురం నియోజవర్గం అభివృద్ధికి గడచిన రెండేళ్లలో 250 కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ రూపురేఖలు మార్చే దిశగా ప్రణాళికను సిద్ధం చేశామని వెల్లడించారు. రానున్న కాలంలో కోటిపల్లి ముక్తేశ్వరం బ్రిడ్జి నిర్మాణం సాధించి తీరుతానని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

మహిళల సంక్షేమానికి, వారి ఆర్థిక పరిపుష్టికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సుభాష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్



కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మహిళలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

**సేవ కోసమే రాజకీయాల్లోకి..**

రామచంద్రపురమే నా శాశ్వత చిరునామా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని.. రామచంద్రపురం నియోజవర్గంలోనే శాశ్వతంగా ఉంటానని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వెల్లడించారు.రానున్న ఎన్నికల్లో రామచంద్రపురం నియోజవర్గం భవిష్యత్తులో జనరల్ అవుతుందని, మంత్రి సుభాష్ అమలాపురం వెళ్ళిపోతారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, శాశ్వతంగా రామచంద్రపురం నియోజవర్గంలోనే ఉంటానని హామీ ఇచ్చారు. రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా మహిళలకు ఉత్సాహాన్ని



కలిగించేలా పలు వినోద కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. నృత్యం, పాటల పోటీలు, అంత్యాక్షరి, టగ్ ఆఫ్ వార్, కుర్చీలాట తదితర పోటీలను నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.వేడుకల్లో మహిళలు మంత్రి సుభాష్‌కు రాఖీలు కట్టి, ఆయనకు తమ ఆత్మీయతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, వేలాదిమంది మహిళలు,తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మహిళలు హాజరై రక్షాబంధన్ వేడుకలను విజయవంతం చేశారు.

# హైవేపై మద్యం దుకాణాలు.. ట్రాఫిక్ ఇబ్బందులు

## దుకాణం వద్ద పెరుగుతున్న రద్దీ.. ప్రమాదాలపై ఆందోళన



**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28**

హుస్నాబాద్ పట్టణంలో మరియు చుట్టుపక్కల హైవే పక్కనే ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనాలు రహదారి పక్కన ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణం వద్ద పార్కింగ్ సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దుకాణం వద్ద ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించాలని, వాహనాలు రహదారిపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనల అమలుపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఎన్నిసార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అంతేకాకుండా హైవేలపై వైన్స్ లు ఉండడం వల్ల అటువైపుగా వెళ్లే మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా మల్లె చెట్టు అక్కనపేట చౌరస్తా ప్రాంతాలలో మహిళలు నడవడానికి అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటారో లేక మౌనంగా ఉంటారో వేచి చూద్దాం.

# వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

## ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గుమ్మా. రాజయ్య.

**యర్రగొండపాలెం :(సిటిజన్ టైమ్స్ )ఆగస్టు 28.**

వికలాంగులు తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక యర్రగొండపాలెంలోని సన్ జో సేవాలయ మానసిక వికలాంగుల అనాధ ఆశ్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి 20 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు .సభకు నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి. పెద్ద పాలంకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పద్మశ్రీ కృష్ణ మాదిగ న్యాయకత్వంలో తాము చేసిన పోరాటాల ఫలితంగా 6 వేల పెన్షన్ ను కూటమి ప్రభుత్వం ద్వారా సాధించుకున్నామని, పోరాటాల ద్వారానే హక్కులు సాదించుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి దివ్యాంగుల సమస్యల పై ప్రత్యేక శ్రద్ద వహించి 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. వికలాంగులకు 10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని, అన్నీ శాఖలలో ఖాళీగా వున్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని,శారీరక వికలాంగుల రోస్టర్ ను 10 లోపు సవరించాలని



డిమాండ్ చేశారు. అనంతరం వికలాంగుల హక్కుల పోరాట సమితి 20 వ ఆవిర్భావ దినోత్సవ కేక్ ను కట్ చేసి మానసిక వికలాంగులకు పంచి పెట్టారు. కార్యక్రమం లో విహెచ్ పి యస్ సీనియర్ నాయకులు కనమాల కోటేశ్వరరావు, తెల్లమేకల. నారాయణ రాజు యాదవ్,తెప్పల వెంకటేశ్వర్లు, అల్లూరి. శివనారాయణ,సందిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# అముడా విస్తరణతో ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి

## జాయింట్ కలెక్టర్, చైర్మన్ వెల్లడి



**అమలాపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28:**

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) పరిధిని విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా జీవో నం. 203 ప్రకారం అముడా పరిధిని 896.16 చదరపు కిలోమీటర్ల నుంచి 1,765.45 చదరపు కిలోమీటర్లకు పెంచారు. ఈ తాజా పునర్వ్యవస్థీకరణతో అముడా పరిధిలోకి అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు మొత్తం 19 మండలాలు, 272 రెవెన్యూ గ్రామాలు చేరాయి. నూతనంగా అముడా పరిధిలోకి చేరిన పంచాయతీల కార్యదర్శులకు పరిపాలనా, పట్టణాభివృద్ధి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు, ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియపై వారికి పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు మాట్లాడుతూ, పరిధి విస్తరణతో జిల్లాలో ప్రణాళికాబద్ధమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. కొత్త ప్రాంతాల్లో ప్రజలు నిబంధనల ప్రకారమే భవన, లేఅవుట్ అనుమతులు పొందాలని స్పష్టం చేస్తూ, ఈ విస్తరణకు సహకరించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలి

**డీఈవో రమేష్ కుమార్ ఆదేశం**




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రాథమిక, కాంప్లెక్స్ పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల వద్ద కూడా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో పునాది స్థాయి భాషా, గణిత సామర్థ్యాలను బలోపేతం చేయడమే ఎఫ్ఎల్ఎన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల్లో పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం పెంపునకు ఎఫ్ఎల్ఎన్ అమలు చేస్తున్నామని తెలిపారు. చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, భావాలను వ్యక్తపరచడంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, సంఖ్యలను గుర్తించడం, లెక్కించడం, కూడిక, తీసివేత వంటి ప్రాథమిక గణిత నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. సెల్ఫీ పాయింట్లు కేవలం ఫొటోలు దిగే ప్రదేశాలుగా కాకుండా అవగాహన వేదికలుగా ఉపయోగించాలని, ప్రతి ఉపాధ్యాయుడు ఎఫ్ఎల్ఎన్ సెల్ఫీ పాయింట్ వద్ద సెల్ఫీ దిగి కార్యక్రమంలో భాగస్వామి కావాలని తెలిపారు. విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఉద్దేశం, ప్రాధాన్యతను వివరించాలని, నిర్దేశించిన లక్ష్యాల సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే విద్యార్థుల భవిష్యత్ అభ్యసనానికి బలమైన పునాది ఏర్పడుతుందని, ఎఫ్ఎల్ఎన్ అమలులో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని డీఈఓ పిలుపునిచ్చారు.

## మత్స్యకారులను స్వగ్రామానికి చేర్చిన ఎంపీ హరీష్

**ఏడుగురి మత్స్యకార కుటుంబాల్లో వెల్లివిసిన ఆనందం...**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

లాంఛనాలు అన్ని పూర్తి చేసి వెస్ట్ బెంగాల్ నుండి, సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను స్వగ్రామానికి తరలించడంలో అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి కీలక పాత్ర పోషించారు. నేడు వారిని స్వగ్రామానికి చేర్చి మత్స్యకారులకు అండగా నిలిచారు.గల్లంతైన మత్స్యకారులు వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో వారి కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గల్లంతైన బోటును తీరానికి చేర్చడంలో సహాయం చేసిన ఇరువురికి, హరీష్ గ్రామస్థులు దుశ్శాలువాలతో సన్మానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసి, మత్స్యకారులకు వెన్నంటి ఉన్న ఎంపీ హరీష్ బాలయోగి కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పి 4 అమలు పై ప్రత్యేక దృష్టి

## పి4 ఒక నూతన ఆర్థిక కార్యక్రమాన్ని బలోపేతం చేయాలి



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు:28**

పేదల ప్రగతి వైపు నడిపించే పి 4 (పబ్లిక్ –ప్రైవేట్– పీపుల్ – పార్ట్‌నర్‌షిప్ )ఒక నూతన ఆర్థిక కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ మార్గదర్శకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో పి4 అమలుపై ప్రత్యేక దృష్టి వహించాలని




రాష్ట్రంలోని రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రులు,జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గంలో పి–4 కార్యక్రమం కింద చేపడుతున్న కార్యక్రమాలు, బంగారు కుటుంబాల గుర్తింపు,మార్గదర్శుల అనుసంధానం, కుటుంబాల అవసరాల మేరకు అందిస్తున్న సహాయ సహకారాలు, సాధికారత కోసం చేపడుతున్న చర్యలపై జిల్లా కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్ ముఖ్యమంత్రికి సమగ్ర వివరాలను తెలియజేశారు.

**పి–4 కార్యక్రమం ఉద్దేశం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర విజన్ -- 2047లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి–4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 19 మండలాల్లో పి–4 కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. అధికారిక పి–4 వేదికలో వ్యవసాయం--జీవనోపాధి, వ్యాపార ప్రారంభం, ఆరోగ్య సహాయం వంటి విభాగాలను కుటుంబాల అవసరాలకు అనుగుణంగా మద్దతు అందించే మార్గాలుగా గుర్తించి అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. పి–4 కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రభుత్వం -- ప్రైవేట్ రంగం -- ప్రజలు కలిసి పనిచేసే భాగస్వామ్య కార్యక్రమమని కలెక్టర్ తెలిపారు. ఆర్థికంగా ఎదిగిన వారు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రవాస భారతీయులు, వివిధ సంస్థలు, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పి–4 కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి అర్హ కుటుంబానికి పథకాల ప్రయోజనాలు, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరికం లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,6 నియోజకవర్గాలలో పి–4 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, సామాజిక సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం. మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఎఫ్ డబ్ల్యూ జే ఉమ్మడి తూర్పు కన్వీనర్ గా జి ఎన్ రావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

ఇండియన్ ఫెడరేషన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఐఎఫ్డబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ గా జి ఎన్ రావు ని యమితు లయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు,పి. రామ కృష్ణ,ప్రధాన కార్యదర్శి డి.నరేంద్ర సాయి నియామకపత్రాలు అందచేసారు.తనకు పదవి రావడానికి సహకరించినరాష్ట్ర అధ్యక్షులు పి. రామ కృష్ణ, ప్రధాన కార్యదర్శి డి. నరేశ్రేద్ర సాయి లకు జిఎన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ గా నియమితులైన జి ఎన్ రావు మాట్లాడుతూ.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో"ఐఎఫ్ డబ్ల్యూజే" బలోపేతానికి కృషి చేస్తాను అన్నారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లో తూర్పు గోదావరి, కాకినాడ జిల్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా లు వున్నాయి.త్వరలో జిల్లాలకు కన్వీనర్ లను నియమించి, తరువాత పూర్తి స్థాయిలో జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి లో కమిటీలు నియమిస్తాను అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

### - మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 28:**

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆడబిడ్డల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.రాఖీ పౌర్ణమి పండుగను రాష్ట్ర ప్రజలందరూ సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరుకున్నారు.



# అక్రిడిటేషన్ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు,28**


అక్రిడిటేషన్ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జర్నలిస్టులకు తెలియజేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి రెండవ జాబితా అక్రిడిడేషన్ కమిటీ సమావేశం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, వివిధ పత్రికల మీడియా ప్రతినిధులతో కలిసి రెండవ జాబితా మీడియా అక్రిడేషన్ సంబంధించి అభ్యంతరాలు, క్రిమినల్ కేసులు వంటి వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తులు, సంబంధిత ధ్రువపత్రాలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై అభ్యంతరాలు, క్రిమినల్ కేసులు వంటి అంశాలను సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిని, పాత్రికేయ విలేకరులను అడిగి తెలుసుకున్నారు. రెండవ జాబితా అక్రిడేషన్ ప్రక్రియలో 131 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం విషయంపై అక్రిడియేటెడ్ కమిటీ మెంబర్స్ అభ్యంతరాలను తెలియజేశారు.ఈ జాబితాలో అనర్హులైన జర్నలిస్టులు ఉన్నారని వాటి తొలగింపు పై పరిశీలించాలని కలెక్టర్ కు అక్రిడిడేషన్ కమిటీ మెంబర్స్ తెలియజేశారు. అక్రిడిటేషన్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా సంస్థల నమోదు వివరాలు, జర్నలిస్టుల నియామకం, విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను ధ్రువీకరించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను గుర్తించి, అవసరమైన పత్రాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం




అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అక్రిడిటేషన్‌కు సంబంధించిన రికార్డులను పద్ధతిగా నిర్వహించి, కమిటీ నిర్ణయాలను నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేయాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వాస్తవాధారాలతో వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగించాలని జర్నలిస్టులను కోరారు. అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు జర్నలిస్టులు అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను సమర్పించి అధికారులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సిహెచ్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని టీడీపీ కార్యాలయానికి కేటాయించడం దారుణం

### మాజీ ఎంపీ చింతా అనురాధ



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన విలువైన మున్సిపల్ భూమిని అధికార పార్టీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించడం దారుణమని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ తీవ్రంగా ఖండించారు. అమలాపురం పట్టణ ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ ఆధీనంలో ఉన్న భూమిని టీడీపీ కార్యాలయం కోసం కేటాయించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తిగా ఉన్న భూమిని అధికార పార్టీ తన పార్టీ అవసరాలకు వినియోగించుకోవడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. "ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలి కానీ, అధికార పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ ఆస్తులను కేటాయించుకోవడం ఏమిటి?" అని అనురాధ ప్రశ్నించారు. జిల్లా ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అవసరమైన వసతి సదుపాయాలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం స్టడీ సర్కిల్ వంటి అవసరాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం బాధాకరమని ఆమె అన్నారు. అలాంటి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన విలువైన రెండు ఎకరాల భూమిని టిడిపి పార్టీ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ప్రజలకు చెందిన ఆస్తులు ఏ రాజకీయ పార్టీకి సొంతం కాదని,అవి ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సినవేనని చింతా అనురాధ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ భూ కేటాయింపును పునఃపరిశీలించి, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అనురాధ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తే ప్రజలు ప్రశ్నిస్తారు. ప్రజల ఆస్తులను కాపాడే విషయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాడుతుందని చింతా అనురాధ స్పష్టం చేశారు.

## కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ ముగింపు సమావేశం



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

జీఎంసీ బాలయోగి జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వారి తో కలిసి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు ఎలాంటి ఎరువులు కొడతా నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఐదేళ్లపాటు సంపూర్ణంగా సహకరించిన నాలుగు జిల్లాల అధికారులకు తోటి జడ్పిటిసి సభ్యులకు మంత్రులకు ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యేలకు వివిధ కార్పొరేషన్ చైర్మన్ లకు మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో శాసన మండలి సభ్యులు కుడిపూడి సూర్య నారాయణ రావు, పేరాబత్తుల రాజశేఖరం, అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో వి.సుబ్బారావు,జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణ రావు.. వివిధ మండలాల జెడ్పిటీసీ,ఎంపీపీలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.లి

## వరలక్ష్మి సామూహిక పూజలు





**రాజోలు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

సఖినేటిపల్లి మండలం , అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భముగా సాముహిక " వరలక్ష్మి కుంకుమ పూజలు " ఆలయ అర్చక స్వాముల ఆద్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో సుమారు 600 మంది ముత్తైదువులు పాల్గొని శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సాముహిక వరలక్ష్మి కుంకుమ పూజల యందు పాల్గొన్న ముత్తైదువులకు ఎటువంటి పూజా రుసుము లేకుండా అమ్మవారి రూపు , పూజ సామాగ్రి పంపిణి చేయుట జరిగినదని ఒక ప్రకటనలో తెలిపారు

## జంతు క్రూరత్వంపై కొరడా – బోనాల్లో కోడిని చంపిన ముగ్గురిపై కేసు నమోదు



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 28**

నాగర్ కర్నూల్ పట్టణంలో ఈదమ్మ పోచమ్మ బోనాల సందర్భంగా బతికి ఉన్న కోడిని దారుణంగా చంపిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీధి జంతు సంరక్షణ సంస్థ ప్రతినిధి ప్రీతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగర్ కర్నూల్ పోలీసు స్టేషన్లో ప్రథమ సమాచార నివేదిక నమోదైంది. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఒక వ్యక్తి కోడిని అమానవీయంగా హింసించి చంపుతున్న దృశ్యాలు ఒక సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి. ఈ వీడియోను గుర్తించిన ఆ జంతు సంరక్షణ సంస్థ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కార్యక్రమ నిర్వాహకుడు, కార్యక్రమ పర్యవేక్షకుడు మరియు కోడిని చంపిన వ్యక్తితో సహా ముగ్గురిపై తెలంగాణ జంతువులు మరియు పక్షుల బలి నిషేధ చట్టం మరియు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తమ సంస్థ ఉద్దేశం కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా ప్రజల్లో అవగాహన తీసుకురావడమేనని ఫిర్యాదుదారు ప్రీతి తెలిపారు. మూగజీవాలపై సాగే హింస ఆగిపోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# శర వేగంగా వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లు

## విజయవంతం చేయాలని మంత్రుల పిలుపు

**యర్రగొండపాలెం: (సిటిజన్ టైమ్స్):ఆగస్టు: 28:**

ఈ నెల 31 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, నీటిని విడుదల చేసి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా దోర్నాల మండలం గంటవాని పల్లి గ్రామ వెలిగొండ ఫీడర్ కెనాల్ వద్ద జల వనరుల శాఖ మంత్రినిమ్మల రామానాయుడు , రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత , మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు,మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ,గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి,యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్యమంత్రి టూర్ కోఆర్డినేటర్ రఘు, వెలిగొండ ప్రాజెక్ట్



అధికారులు మరియు దోర్నాల మండల నాయకులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్, వెలిగొండ ప్రాజెక్ట్ పనులు, ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు మరియు ఇతర అంశాలపై అధికారులతో



సమీక్షించారు.వెలిగొండ జలాలతో యర్రగొండపాలెం నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నం సాకారం కానున్న ఈ చారిత్రాత్మక ఘట్టానికి నియోజకవర్గ ప్రజలు, రైతులు, యువత, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని గూడూరి ఎరిక్షన్ బాబు పిలుపునిచ్చారు.

## అయ్యవారిపల్లె లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్.



**కొమరోలు (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

కొమరోలు మండలం నల్లగుంట్ల పంచాయతీలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఇంటింటికి తెలుగుదేశం- ప్రజల ఇంటి ముంగిట కు సంక్షేమ పథకాలు అనే కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను వెంకటేశ్వర్లు యాదవ్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని, గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు స్థాయి జిల్లా పరిషత్ స్థాయి వరకు అన్ని స్థానాలను తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ జనతా పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రజలు తమ వంతు సహకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని వార్డు సర్పంచ్ పదవులు ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటం, గిద్దలూరు నియోజకవర్గానికి ముత్తుముల అశోక్ రెడ్డి శాసనసభ్యులుగా ఎన్నిక కావడం ప్రజలు చేసుకున్న అదృష్టంగా ఆయన అభివర్ణించారు. ఆ కార్యక్రమంలో జ్యోతి ఇంద్రారెడ్డి, పాండురంగస్వామి, శివరాం, రాజకుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండపై వైసీపీది కపట ప్రేమ: బీజేపీ నేత ఏలూరి




**మార్కాపురం (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

వెలిగొండ నిర్వాసితులపై వైసీపీ కపట ప్రేమ చూపుతోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విమర్శించారు. నిర్వాసితులకు రూ.740 కోట్ల పరిహారం ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసిందని ఆరోపించారు. 2026 నాటికి 18 ఏళ్లు నిండిన నిర్వాసిత యువతకు రూ.2 లక్షలు ఇవ్వాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయం హర్షణీయమన్నారు. మిగిలిన అర్హులకు కూడా న్యాయం చేస్తామని, వైసీపీ రాజకీయాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.


## నేడు 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**కొమరోలు (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

కొమరోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 15 గ్రామాలకు ఈనెల 29వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త విద్యుత్తు లైన్ల ఏర్పట్లలో భాగంగా ఈనెల 29వ తేదీన మండలంలోని పలు గ్రామాలలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ సందర్భంగా ఈనెల 29వ తేదీ శనివారం కొమరోలు, గోపానిపల్లి, పురుషోత్తమునిపల్లి, తాతిరెడ్డిపల్లి,, కే బొంతపల్లి, సర్వేరెడ్డిపల్లి, బావాపురం, సూరవారిపల్లి, బాదినేనిపల్లి, బొడ్డువానిపల్లి,, రామవారిపల్లి,బెడుసుపల్లి, మొట్టుపల్లి, గుంతపల్లి గ్రామాల పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఆ కారణంగా పైన పేర్కొన్న 15 గ్రామాలకు ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



# శ్రీవారికి పవిత్రాలు సమర్పణ





**ఒంగోలు, (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా భక్తజన నయనానందకరంగా జరుగుతున్నాయి. పవిత్రోత్సవాల రెండవ రోజైన శుక్రవారం శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి శుక్రవార అభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి ఇతర దేవతామూర్తులకు పవిత్రాలను సమర్పించడం తో పాటు విశేష స్నపన తిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. కుంభారాధన, నిత్య హోమం, సుదర్శనారాధన, పంచసూక్త హోమం, పారమాత్మిక హోమం, అష్టాశీతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం ఆలయ అర్చకులు శ్రీవారి ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ వారి ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం పూర్ణాహుతి, రక్షాబంధన విసర్జన, ఆచార్య శేష వస్త్ర బహుమానం, బ్రహ్మ ఘోష కార్యక్రమాలు జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## ఓటు వేయని యువతకు భవిష్యత్తుపై ప్రశ్నించే హక్కు ఉందా?

### - ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల స్వీప్ కార్యక్రమంలో కమిషనర్ కె. అనూష

**కందుకూరు (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

ఓటు వేయకుండా దేశ భవిష్యత్తుపై ప్రశ్నించడం కంటే, ముందుగా ఎన్నికల్లో పాల్గొని బాధ్యతగల పౌరులుగా నిలవాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె. అనూష పిలుపునిచ్చారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయంతో నిర్వహించిన స్వీప్ (ఓటరు అవగాహన) కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు, జీవితంలో స్థిరపడడం గురించి ఎంతగా ఆలోచిస్తారో, అంతే బాధ్యతతో దేశానికి మంచి ప్రభుత్వం రావడానికి ఎన్నికల్లో కూడా పాల్గొనాలని అన్నారు. ప్రతి ఓటు దేశ దిశను మార్చే శక్తి అని, డబ్బు లేదా ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం ప్రజాస్వామ్యానికి నష్టం అని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు, పెద్దలు, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించడం కూడా యువత సామాజిక బాధ్యత అని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఓటు విలువ, ఎన్నికలపై చైతన్యం కల్పించిన



కమిషనర్ కె. అనూషకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ అభివృద్ధికి యువత ప్రతి రంగంలో ముందుండాలని, ముఖ్యంగా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ, "బాధ్యతగల విద్యార్థి రేపటి బాధ్యతగల ఓటరు" అని అన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించడమే కాకుండా, సమాజంలో ఓటరు చైతన్యాన్ని పెంచే వారిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ సిబ్బంది, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, డా. ఆశా మాధవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి. ఏడుకొండలు, కిషోర్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కందుకూరులో హెవీ వాహనాలపై ఆంక్షలు

### -నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు -సీఐ షేక్ అన్వర్ బాషా

**కందుకూరు (సిటిజన్ టైమ్స్) ఆగస్టు 28**

కందుకూరు పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని హెవీ వాహనాల రాకపోకలపై అమలు చేస్తున్న ఆంక్షలను పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిఐ షేక్ అన్వర్ బాషా మాట్లాడుతూ వ్యాపారుల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు వ్యాపార అవసరాలకు సంబంధించిన లారీలను మాత్రమే పట్టణంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు.



ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హెవీ వాహనాలకు పట్టణంలోకి ప్రవేశం లేదు అని అన్నారు. అయితే వ్యాపారుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య రెండు గంటల పాటు వ్యాపారానికి సంబంధించిన లారీలకు ప్రత్యేకంగా అనుమతి కల్పించినట్లు సీఐ పేర్కొన్నారు.

**ఈ సమయాల్లో ప్రవేశం నిషేధం**

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లారీలు, పొట్టు, కర్రలు తదితర లోడ్లతో వెళ్లే ట్రాక్టర్లు, ఇతర హెవీ వాహనాలను పట్టణంలోకి అనుమతించబోమని అన్వర్ బాషా స్పష్టం చేశారు.పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేందుకు ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి నిషేధిత సమయాల్లో హెవీ వాహనాలతో పట్టణంలోకి ప్రవేశించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్వర్ బాషా హెచ్చరించారు.పట్టణ ప్రజలు, వ్యాపారులు, వాహన యజమానులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## మత్స్యకారులను కాపాడిన బార్నర్ బోర్డ్ ప్రతినిధులను అభినందించిన జిల్లా కలెక్టర్



అమలాపురం సిటిజన్ టైమ్స్:28.ఇటీవల సముద్రంలో గల్లంతయిన ఏడుగురు మత్స్యకారులను రెస్క్యూ చేసి కాపాడిన పచ్చిమ బెంగాల్ గోదావరి బార్మర్ బోర్డ్ ప్రతినిధులైన దిగా వెస్ట్ బెంగాల్ పురుషోత్తం కుందూ ,అరబిందో బుర్మాన్ జిల్లా కలెక్టర్ ఆర్ .మహేష్ కుమార్ శు క్రవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు అభినందించారు.

## కుటుంబ బంధాలు బాధ్యత రాఖీ పండగ

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

కుటుంబ బంధాలు, పరస్పర ప్రేమ, బాధ్యత, ఆత్మీయతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ జిల్లా సోదరీ సోదరీమణులకు తెలిపారు. శుక్రవారం జిల్లాలో ప్రజలను ఉద్దేశించి సోదరీ సోదరీమణులకు రాఖీ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్ వద్ద వివేకా సంస్థ వారు విభిన్న ప్రతిభావంతుల పిల్లలు తమ చేతులతో జిల్లా కలెక్టర్ వారికి రక్షాబందన్ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్.నైడియా దేవి వారును కలిసి వివేకా సంస్థ తరపున విభిన్న ప్రతిభావంతుల పిల్లలు రక్షాబంధన్ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కొత్తపేట ఎమ్మెల్యే

**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 28**

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొన్నారు. విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్, పి 4 లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.





# నాని 'ప్యారడైజ్'కి ఆ టైం ఉండదా?



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' మూవీని మొదట ఆగస్టు నెలలో విడుదల చేయాలని భావించారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా వేశారు. ప్యారడైజ్ ఆలస్యం కావడంతో రవితేజ 'ఇరుముడి' సినిమాకు కలిసి వచ్చింది. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవితేజ ఇరుముడి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసింది. మొదటి వీకెండ్ పూర్తి అయ్యేప్పటికి దాదాపు వంద కోట్ల వసూళ్లకు చేరువ అయింది. అతి తక్కువ సమయంలోనే యూఎస్‌లో మిలియన్ డాలర్ల వసూళ్లు నమోదు చేసింది. అంతకు ముందు వారం విడుదలైన సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా సైతం బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. లక్కీ ఆగస్టు ను నాని ప్యారడైజ్ మిస్ చేసుకుంది అంటూ చాలా మంది అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని మూవీ...**

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను రాజమౌళి కంటే ఎక్కువగా చెక్కుతున్నట్లు అనిపిస్తుందని, ఇకపై అయినా సినిమాను పూర్తి చేసి విడుదలకు రెడీ చేయాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం సినిమా షూటింగ్ ఇంకా బ్యాలన్స్ ఉంది. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. షూటింగ్ ఇంకా రెండు వారాలు పట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ సినిమాకు అనిరుథ్ సంగీతాన్ని అందించాల్సి ఉంది. షూటింగ్ పూర్తి చేసి ఇస్తే తప్ప రీ రికార్డింగ్ పూర్తి చేసి ఇవ్వలేని పరిస్థితి. అనిరుథ్ చాలా బిజీ మ్యూజిషియన్ అనే విషయం తెల్సిందే. ఆయనకు డెడ్ లైన్ పెట్టకుండా , సినిమాను విడుదల తేదీకి కనీసం నెల ముందు అయినా ఇవ్వాలనే టాక్ ఉంది. కానీ వారం రెండు వారాల సమయం ఇచ్చి హడావిడిగా ఇవ్వాలంటే అనిరుథ్ ఎలా రియాక్ట్ అవుతాడో అనేది చూడాలి.

**నాని ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ డేట్...**

అనిరుథ్ ను కన్విన్స్ చేసి ఏదోలా వర్క్ చేయించుకున్నా ది ప్యారడైజ్ మూవీ యూనిట్ కి ప్రమోషన్ చేసేందుకు సరైన సమయం ఉండక పోవచ్చు అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. సినిమా విడుదలకు వారం ఉండగ కూడా ఏదో ఒక వర్క్‌తో హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, హీరోయిన్ కయాదు బిజీగా ఉంటే ప్రమోషన్‌లో కనిపించేది ఎవరు అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కాలంలో విడుదలై మంచి విజయాలను సొంతం చేసుకున్న సినిమాలను చూస్తే ఎక్కువ శాతం రెండు మూడు వారాలు, అంతకు మించి ప్రమోషన్ చేసిన సినిమాలు ఉన్నాయి. అంతెందుకు ఇటీవల విడుదలైన ఇరుముడి సినిమాను రవితేజ, శివ నిర్వాన రెండు మూడు వారాలు ముందు ఉండి మరీ ప్రమోషన్ చేశారు. రవితేజ ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చాడు. శివ నిర్వాన చాలా ఇంటర్వ్యూలు ఇవ్వడంతో పాటు, ప్రెస్‌మీట్స్ లో కనిపించాడు.

**నాని, శ్రీకాంత్ ఓదెల మూవీ..**

అంతకు ముందు వచ్చిన సినిమాల విషయంలోనూ ప్రమోషన్ కీలక పాత్ర పోషించింది. అందుకే కంటెంట్ కంటే ప్రధానంగా ప్రమోషన్‌కి టైంను చూసుకుంటున్నారు. ప్రమోషన్స్ కు సమయం లేని కారణంగా వాయిదా పడ్డ సినిమాలు ఉన్నాయి అంటే అతిశయోక్తి కాదు. పరిస్థితులు ఇలా ఉంటే ది ప్యారడైజ్ సినిమాను మాత్రం పెద్దగా ప్రమోషన్ లేకుండానే వచ్చే నెల 24న విడుదల చేయాలని మేకర్స్ హడావిడి చేస్తున్నారు. ది ప్యారడైజ్ మూవీకి ఉన్న బజ్ నేపథ్యంలో నైజాం ఏరియాలో భారీ బిజినెస్ చేసింది. ఇతర ఏరియాల్లోనూ నాని కెరీర్‌లో బెస్ట్ నెంబర్స్ నమోదు అయ్యాయి అంటున్నారు. నైజాం ఏరియాలో నెవ్వర్ బిఫోర్ నెంబర్స్‌ను నాని చూస్తాడనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే ఆలస్యం అయిన సినిమాను మరోసారి వాయిదా వేసే పరిస్థితి లేదు. కనుక శ్రీకాంత్ ఓదెల కాస్త ప్రమోషన్ విషయంలోనూ దృష్టి పెట్టాలని, నాని కాస్త బయటకు వచ్చి సినిమా గురించి జనాల్లో తెలిసేలా మాట్లాడాలంటూ ఫ్యాన్స్ విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక వైపు షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేస్తూనే ప్రమోషన్ వర్క్ సైతం చేయాల్సిన అవసరం ఉంది. మరి నాని, శ్రీకాంత్ ఈ విషయాన్ని ఎలా బ్యాలన్స్ చేస్తారో చూడాలి. సెప్టెంబర్ 24న విడుదల కాబోతున్న ది ప్యారడైజ్ మూవీకి పెద్దగా పోటీ లేకపోవడం వల్ల సాలిడ్ ఓపెనింగ్స్ నమోదు కావడం ఖాయం అని విశ్లేషకులు అంటున్నారు.




## సోనల్ దినుష అద్భుతం.. ప్రత్యేకంగా అభినందించిన గౌతమ్ గంభీర్

**లంక యువ బ్యాటర్ సోనల్ దినుషపై గంభీర్ ప్రశంసలు**

**భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రా చేసిన దినుష**

**టెస్ట్ సిరీస్‌ను 1-0 తేడాతో గెలుచుకున్న టీమిండియా**



భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ప్రత్యర్థి జట్టులోని ఓ యువ ఆటగాడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రీలంక యువ సంచలనం సోనల్ దినుష అసాధారణ పోరాటపటిమను ప్రత్యేకంగా అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. భారత్‌తో రెండో టెస్టును ఒంటిచేత్తో డ్రాగా ముగించిన అతడి ఆటతీరును గంభీర్ మెచ్చుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకున్నప్పటికీ, దినుష ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. శుక్రవారం తన 'ఎక్స్' ఖాతాలో గంభీర్ స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్‌కు పట్టుదల, ఓపిక, మానసిక దృఢత్వం చాలా అవసరం. మన కుర్రాళ్లు దానిని ప్రదర్శించారు! అయితే, సోనల్ దినుష అసాధారణ ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు!" అని పేర్కొన్నాడు. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో గురువారం ముగిసిన రెండో టెస్టులో, టీమిండియా విజయం అంచున నిలిచింది. అయితే, లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన సెంచరీతో లంకను ఆదుకున్నాడు. ఫాలో ఆన్ ఆడుతూ కష్టాల్లో పడిన జట్టును తన అజేయమైన 133 పరుగుల (264 బంతుల్లో) ఇన్నింగ్స్‌తో గట్టెక్కించాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫలితంగా భారత్ 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసే అవకాశాన్ని కోల్పోయింది. అంతకుముందు గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే.

**రికార్డుల మోత మోగించిన దినుష**

ఈ సిరీస్‌లో సోనల్ దినుష అద్భుత ఫామ్‌తో చెలరేగాడు. మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌లలో ఏకంగా 420 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, ద

ఒక హాఫ్ సెంచరీ (84) ఉన్నాయి. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆరో స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి ఒకే టెస్టులో రెండు సెంచరీలు చేసిన నాలుగో శ్రీలంక ఆటగాడిగా నిలిచాడు. అలాగే, ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలోనూ శతకాలు బాదిన ఎనిమిదో శ్రీలంక క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన మూడో లంక బ్యాటర్‌గా అరవింద డిసిల్వా, కుమార సంగక్కర సరసన చేరాడు.

## టెస్టుల్లో నా సత్తా ఏంటో చూపించా: పడిక్కల్ హ్యాపీ

- టెస్టుల్లో పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకున్న పడిక్కల్
- శ్రీలంక సిరీస్‌లో 328 పరుగులతో అదరగొట్టిన బ్యాటర్
- 109.33 సగటుతో రెండు సెంచరీలు చేసిన పడిక్కల్
- స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ముందే ప్రత్యేకంగా సిద్ధమైనట్లు వెల్లడి
- శ్రీలంకలో పరిస్థితులు సవాలుగా ఉన్నాయన్న పడిక్కల్



టెస్టు క్రికెట్‌లో తాను పెద్ద స్కోర్లు చేయగలనని నిరూపించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని భారత బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అన్నాడు. శ్రీలంకతో 1-0తో సిరీస్ గెలవడంలో తన ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏళ్లుగా సాధించిన నిలకడే టెస్టుల్లోనూ రాణించేందుకు ఉపయోగపడిందని చెప్పాడు. సాయి సుదర్శన్ గాయపడటంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ రెండు టెస్టుల్లో 328 పరుగులు చేశాడు. 109.33 సగటుతో రెండు సెంచరీలు సాధించాడు. ఈ సిరీస్‌లో తనకు అవకాశం వస్తుందని తెలిసినప్పటి నుంచే దాని కోసం ఎదురుచూశానని తెలిపాడు. తన సత్తా ఏంటో చూపించేందుకు ఇదే సరైన అవకాశమని భావించానని చెప్పాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పెద్ద స్కోర్లు చేసినట్లే టెస్టుల్లోనూ చేయగలిగానని ఆనందం వ్యక్తం చేశాడు. ఈ సిరీస్ ఇచ్చిన నమ్మకంతో కెరీర్‌లో ముందుకు సాగుతానని అన్నాడు. శ్రీలంకలో వేడి, ఉక్కపోత పరిస్థితులు జట్టుకు సవాలుగా నిలిచాయని పడిక్కల్ చెప్పాడు. పరిస్థితులు అంత సులభంగా లేకపోయినా మొత్తం జట్టు వంద శాతం కష్టపడిందని ప్రశంసించాడు. అందరూ ఒకే లక్ష్యంతో ఆడటం మంచి సంకేతమని పేర్కొన్నాడు. శ్రీలంక స్పిన్నర్లను ఎదుర్కోవడంపై సిరీస్‌కు ముందే ప్రత్యేకంగా సిద్ధమయ్యానని పడిక్కల్ వెల్లడించాడు. అక్కడ స్పిన్‌ను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా ఉంటుందని ముందే తెలుసని చెప్పాడు. అందుకు తగ్గట్టుగా సాధన చేయడం వల్ల మంచి ఫలితం వచ్చిందని తెలిపాడు. ఇకపైనా స్పిన్‌ను ఎదుర్కొనే విషయంలో మరింత మెరుగవుతానని అన్నాడు.

రెండో టెస్టులో శ్రీలంక బ్యాటర్లు అద్భుతంగా పోరాడారని పడిక్కల్ ప్రశంసించాడు. సోనల్, కేశర బ్యాటింగ్ అసాధారణంగా ఉందన్నాడు. భారత బౌలర్లు తమ శక్తిమేరకు ప్రయత్నించారని చెప్పాడు. అయితే శ్రీలంక ఆటగాళ్లు మంచి క్రికెట్ ఆడి డ్రా చేసుకున్నారని పేర్కొన్నాడు.

## కుర్రాళ్ల జోరుకు గిల్ ఫుల్ ఖుషీ.. భారత్‌కు కొత్త బలం!

**శ్రీలంకపై 1-0తో సిరీస్ గెలిచిన భారత్**

**యువ ఆటగాళ్ల ప్రదర్శనపై గిల్ సంతోషం**

**పడిక్కల్ రెండు సెంచరీలతో 328 పరుగులు**

**సిరీస్‌లో మానవ్ సుతార్ కు 16 వికెట్లు**

**గాలే టెస్టులో సుతార్‌కు పది వికెట్ల ఘనత**



శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచిన తర్వాత భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో విజయం సాధించడం ఆనందంగా ఉందన్నాడు. రెండో టెస్టు డ్రాగా ముగిసినా, ఈ పర్యటనలో జట్టుకు ఎన్నో మంచి అంశాలు కనిపించాయని తెలిపాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు దేవ్‌దత్ పడిక్కల్, మానవ్ సుతార్ రాణించడం తనను ఆకట్టుకుందని చెప్పాడు. సాయి సుదర్శన్ స్థానంలో మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ సిరీస్‌లో అదరగొట్టాడు. రెండు సెంచరీలతో 328 పరుగులు చేశాడు. క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడాలని బ్యాటర్లకు చెబుతుంటామని గిల్ అన్నాడు. పడిక్కల్ అదే చేసి చూపించాడని ప్రశంసించాడు. అతడి ఆట జట్టుకు మంచి సంకేతమని తెలిపాడు. ఎడమచేతి స్పిన్ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పైనా గిల్ ప్రశంసలు కురిపించాడు. సిరీస్‌లో 16 వికెట్లు తీసిన సుతార్ గాలే టెస్టులో పది వికెట్లతో భారత్ 165 పరుగుల విజయానికి కీలకంగా నిలిచాడు. అతడు భవిష్యత్తులో భారత స్పిన్ దాడికి చాలా కాలం నాయకత్వం వహించే ఆటగాడిగా ఎదుగుతాడని గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారీ వికెట్లు తీసే అవకాశం కల్పిస్తున్నాడని అన్నాడు. రెండో టెస్టు డ్రా కావడం మాత్రం నిరాశ కలిగించిందని గిల్ చెప్పాడు. రెండో రోజు ఆట ముగిసే సరికి గెలుస్తామని భావించామని తెలిపాడు. కానీ చివరి మూడు రోజులు శ్రీలంక అద్భుతంగా పోరాడిందని ప్రశంసించాడు. ప్రత్యర్థి ఆట నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలని అన్నాడు. ఈ సిరీస్ నుంచి మంచి అనుభవం దక్కిందని, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో మరింత మెరుగ్గా ఆడతామని గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776